తనచుట్టూ చీకటినిండా దీపాలు.

నెమ్మదిగా వొంగి, క్రిందనున్న దీపాల వరుసలు చూడబోయింది శ్యామల. చేతికి చుట్టుకున్న చెంగు చిన్న ప్రమిదని రాసుకుని అంటుకుంది. మంట ఒక్కసారిలేచి నుదురుకి తగిలింది.

ఛ్రున వొచ్చిన మంటనించి శ్యామల త్వరగా తప్పించుకోలేకపోయింది. నుదురంతా కాలేదాకా చీరని ఉన్న మంటా ఆరలేదు. తరువాత-

బాధగా కళ్లు తెరిచింది శ్యామల. నుదురు అంతా విపరీతంగా బాధిస్తూన్నది. కట్టుకట్టారులా ఉంది.

"ఎలాఉంది శ్యామా?"

సత్యం నెమ్మదిగా అడిగాడు. శ్యామల తెల్లబోయినట్లు చూసింది. ఆ ఆప్యాయం ఇంకా.

"ఎలాఉంది?"

మళ్ళీ అడిగాడు.

"ఆ అద్దం ఓసారి."

అతను తెచ్చిఇచ్చాడు.

"కట్టు విప్పండి."

"ఎందుకు?"

"ఒక్కసారి విప్పండి."

"ఒద్దు శ్యామా చాలా బాధ పెడుతుంది. వొద్దు."

"కాదు-వెంటనే కట్టుకుంటానుగా!"

నెమ్మదిగా ఆకట్టు విప్పాడు సత్యం. నుదుటినిండా నల్లటిగాయం. ఒక కంటిక్రింద పెద్దమచ్చ అద్దంలో.

"అసహ్యంగా ఉందికదూ?"

"లేదు శ్యామా. ఏమిటా ప్రశ్న?"

"చెప్పండి."

"లేదు. ఏమీ అసహ్యంలేదు. కొద్దిరోజుల్లో అంతాపోతుంది."

"మచ్చలు ఉంటాయి."

"ఉండనీ"

అతను అద్దం తీసుకుని దూరంగా పెట్టేడు. ఆమె మళ్ళా మంచంమీద పడుకుని ఒకసారి కళ్లు మూసుకుంది.

కళ్లు తెరిచేసరికి అతడు ఎదురుగా నిలబడ్డాడు. తన కళ్ళల్లోకి చూస్తూ.

"కట్టుకట్టేదా శ్యామా?"

ఆ ఆప్యాయంతోనే అడిగాడతను దగ్గరగావొస్తూ.

"ఒద్దు. అవసరంలేదు."

నెమ్మదిగా అతనిచేతులు తన చేతులలో తీసుకుంటూ అన్నది శ్యామల.

"ఏమా?"

"దీపావళి వొచ్చింది. అందుకనీ."

---

కథానిక

# మునిమాపు వయస్సులో—

బి. వి. రమణారావు

అసలేదైనా చదవవలసివస్తే ఎడమవైపునుంచి కుడివైపుగా చదువుతాం. ఉరుదూ భాష కుడినుంచి ఎడమవైపుగా చదువుతారు. చైనా భాష పైనుంచి కిందికి నిలువుగా చదవాలిట. మా అల్లుడు మహాశయుడి వుత్తరంమాత్రం నేను కిందనుంచి పైకి చదువుతాను. ఎంచేతంటే ఆ వుత్తరంయొక్క సారాంశం చివరి అంగుళం మేరలోనూ యిమిడివుండి ధగధగ మెరుస్తూ వుంటుంది. ఒక్కొక్కసారి దానికేసి చూసేటప్పటికి కళ్లు చీకట్లు కమ్మడం కూడా కద్దు. ఇంతకి యీనెల వచ్చిన వుత్తరంలో ఆఖరు వాక్యం యిది. "అందుచేత యీనెల మీరు పంపించవలసినది...రు. 150."

ఏనెల కానెల ఖర్చు తగ్గించమని నేను రాస్తూనే వున్నాను. మరి వాడి ఖర్చులేమో నాబోదకాలులాగ పెరగడమేకాని తరగడం కనబడటంలేదు. నూటయాభై రూపాయలు. హుం ఇంతోటి బి. ఏ. చదువుకీ. తర్వాత వీడు నెలకి నూటయాభై కాన్లు సంపాదిస్తాడో లేదో కాని, ఏమయితే అయింది ఈ నెల నూరు పంపిస్తాను. అంతే, అసలు నాకు యీ బ్లడ్‌ప్రెషర్ రోగం వీడి మూలాన్నే వచ్చింది. అదుగో, వంటింట్లో

కంచాలు తోముతున్న చప్పుడవుతూంది. ఇంకో పదినిముషాల్లో మా ఆవిడ వస్తుంది. ఏమయితే అయింది. మా ఆవిడతోటి, మా అమ్మాయితోటి చెప్పే చేస్తాను. నాకేంభయమా? ఇలా నిర్ధారణ చేసుకుని, చుట్టపతల పారేసి, పడకకుర్చీమీద కాళ్ళు చాపి పడుకుని, మా ఆవిడకోసం ఎదురు చూస్తూ రాబోయే ప్రళయాన్ని ఊహించుకుంటూ, నే ధరించవల్సిన పాత్ర రిహార్సల్ వేసుకుంటూ, మనస్సులో కత్తి నూరుకుంటూ, "ఆపదలందు ధైర్యగుణం బంచిత..." పద్యాన్ని వల్లించుకుంటూ కళ్ళు మూసుకున్నాను.

"ఏమండీ...ఏమండీ" అంటూ, మా ఆవిడ పిలుపు మగతగా విని కళ్ళు తెరిచాను. కన్నీళ్ళతోటి, ఎదురుగా మా ఆవిడ నిలబడి "ఏమండీ. అమ్మాయికూ..."

"హాఁ" అంటూ ఉలిక్కిపడి లేచాను. హరి భగవంతుడా! ఏమిటి యీ పిడుగువంటి వార్త! ఏమి వినిపించబోతున్నావు, ఏం కొంప మునిగిందో ఏమిటో. ఇదంతా నూటయాభై పంపించమని రాస్తే నూరు పంపిద్దామనుకున్న పాపానికి ఫలితమా ఏమిటి అనుకుంటూ పడక్కుర్చీమీద నుంచి లేచి పంచె కుచ్చిళ్లు సర్దుకుంటూ, దిక్కుతోచక, బొంగురుపోయిన గొంతుకతోటి "ఏమయిందే.. అమ్మాయేదీ...? సంగతేమిటే... త్వరగా చెప్పు" అన్నాను.

"అది కాదండీ... అమ్మాయికూడా యింట్లో లేదూ అనబోతున్నాను. ఉత్తరంలో ఏముందో చదివి చేత్తోపట్టుకుని మీరలాగే పడక్కుర్చీలో, నోటమ్మటమాటరాకుండా పడిపోయారు. ఇంతకీ అల్లుడు వొంట్లో ఏమీ లేకుండా కులాసాగా వున్నట్టేనా?" అంది మా ఆవిడ పమిటచెంగుతో కళ్లు వొత్తుకుంటూ.

అప్పుడు నాకు సంగతి అర్థమయింది. కాని ఒక్కక్షణంలో మనస్సు పరిపరి విధాల పోయిందేమో, ఇంకా ఆపాదమస్తకం, ఒక్కనాబోద కాలుతప్ప, ఒణికిపోతూనేవుంది. ఇలా నా హృదయవేదన కనుగుణంగా శరీరం తాళంవేస్తూంటే దానికి తగ్గట్టు చేతులో వుత్తరం నాట్యంచేస్తుంది. మళ్ళీ మా ఆవిడ కళ్ళల్లో ఓ నూతన అశ్రుకణం. ఇంతకీ యింకా నా నోరు పెగలేగు. ఆ ప్రయత్నంతో పెదిమలు తడిచేసుకుంటున్నా. ఇంతలో అనుకున్నంత పనీ అయింది. మా అమ్మాయి వచ్చింది. అసలే సూక్ష్మగ్రాహి, గుమ్మంలోంచే అల్లుడి దస్తూరీ ఆనమాలు కట్టింది. మా ఆవిడ మొహంకేసి చూసింది. నా పరిస్థితి గమనించింది. క్షణంలో జరిగిందంతా గ్రహించిన దానిలాగ గుండె చెరువయ్యేటట్లు "నాన్నా!" అంటూ ఒక్క పరుగులో వొచ్చి నన్ను కౌగలించుకుని నా చేతులోంచి జారిపోతున్న వుత్తరాన్ని అందుకుంది. "శారదా" అంటూ మా అమ్మాయినొక్కసారి కౌగలించుకున్నట్టూ, "ఆఁ... ఏముందీ వుత్తరంలో" అంటూ మా ఆవిడ వెర్రికేక వేసినట్టూ నా కాళ్లు అమాంతంగా అప్పడాలపిండిలా అయిపోయినట్టూ చూచాయగా గుర్తుంది.

ఒంటిమీద స్పృహ వచ్చేటప్పటికి పడక కుర్చీలో వున్నాను. మా అమ్మాయి చెంచాతో హార్లిక్సు గొంతుకలోపోస్తుంది. గుండెల్లోమాత్రం యింకా మిలిటరీబ్యాండు మోగుతున్నట్టే వుంది. స్మృతి శిథిలాలని త్రవ్వి గతచరిత్ర జ్ఞాపకం తెచ్చుకున్నాను. అసలు కష్టాలన్నీ మానవుడికి అంత్యదశలో వస్తాయి. అందుకుసాయం జవసత్త్వాలన్నీ అప్పుడే సన్నగిలుతాయి. వార్ధక్యం మధ్యలోను, యౌవనం అంత్యదశలోనూ వుండకపోవడం భగవంతుడి తెలివితక్కువవల్ల మానవుడికి సంక్రమించిన దురదృష్టాలలో ఒకటి. ఇందాకటి నా బ్లడ్ ప్రెషర్‌తోటి, అసలు దాన్ని వుపయోగించే మేధావి లేకపోయాడు కాని, అమాంతంగా మెడ్రాస్ మెయిల్‌ని ఇంజన్ లేకుండా కలకత్తా లాక్కుపోవచ్చు. ఇంతకీ ఎంత చిత్రసంఘటన! ఇద్దరూ కలిసి నా ప్రాణాలు తీసేద్దురు.

"ఏమీలేందే ఎంత గాభరా పెట్టేశారండీ!" అంటూ అందుకుంది మా ఆవిడ, మూలనుంచి తమలపాకులు తీస్తూ.

పైగా, గాభరాపెట్టింది నేనుట! కొంపమునిగిపోయినట్టు ఏడుపు మొహంతో ప్రత్యక్షమై ఖంగారుపెట్టింది తనూ. ఇంతకీ కాస్త సర్దుకుని జవాబివ్వడానికేనా వ్యవధిలేకుండా అమ్మాయి వచ్చి బావురుమంది. నేనేం చెయ్యనూ నాకు కాళ్ళాడలేదు.

మా. ఆ: మనస్సు పరిపరివిధాలపోయింది. ఏం కొంప మునిగిందో అనుకున్నాను.

శా: అదేమిటి నాన్నా అలా ఖంగారుపెట్టే శావు? నాకసలు ప్రాణాలు పైకేపోయాయి.

నా ప్రాణాలసలు పోయి మళ్ళీ వొచ్చాయి. చచ్చే బతికేను. నే నెవరితో చెప్పుకోను. పైగా తప్పంతా నాదిట. అనుకుంటే అనుకుంటుంది. నాకేం? పోనీ యీపూట తమలపాకులు యివ్వ దేమో...అంతేనా...హుఁ...

మా. ఆ: ఔొవ్వ, ఔొవ్వ. ఎవళ్ళైనా వింటే నవ్విపోతారు. నిక్షేపంలాంటి వుత్తరంవస్తే ఎంత గందరగోళం చేశారు. అల్లుడు కులాసాగా వున్నాడా అని మహాను భావుణ్ణనుగుతే గుడ్లప్పగించి నాకేసి బెదురుచూపులు చూస్తారు. కాని మాట్లాడరు కదా!”

ఇవి భార్యఅనవలసిన మాటలేనా? వయసులో వున్నప్పుడు సీతా అనసూయల్ని మరపించేటంతటి పతివ్రత. సరే యిప్పుడు అన్నింటితో బాటు పాతివ్రత్యం తగ్గింది. వక్కపొడి నోట్లో పోసుకుంది. తమలపాకులు తనకేనన్నమాట.

శా: కళ్ళజోడు పెట్టుకునే చదివేవా నాన్నా!

తల్లికి మించిన కూతురు. నవ్వు,నవ్వు...వేళాకోళంగానే వుంటుంది. నేనుచావల్సింది. అప్పుడు తెలుసును.

మా. ఆ: పాపం! మొన్న వుత్తరంలోను స్త్రీగా వుందనిరాశాడా, ఇవ్వాళ వుత్తరం రాగానే ఈయనగారు కాళ్ళాడకుండా పడక్కుర్చీలో చతికిలబడ్డారాయిరి. ఇంకేమనుకోను?

శా: మొన్న వుత్తరం వొచ్చినప్పటినుంచీ, నాకసలు మనస్సు మనస్సులోలేదు. ఇందాకా చూద్దును కదా నువ్వు కంట తడిపెట్టుకున్నావు. నాన్నేమో వుత్తరంతోసహా వొణికిపోతున్నావు. నేనుమాత్రం ఏమనుకోనూ?

ఏమిటి అనుకునేది వీళ్ళమొహం చచ్చే డనుకున్నారా! నానోటికి తిన్నగారాదు కాని. వాడి దగ్గర్నుంచి వుత్తరం వొచ్చింది. చచ్చినవాడు వుత్తరం రాయడుకదా! ఇంతాచేస్తే వాడికొచ్చిన రోగమల్లా జలుబుచేసి పడిశం పట్టిందిట. ఏం తిన్నా ఓలాగే వుందిట. ఇక్కడ నేను ఈ బోదకాలు జ్వరంతోటీ, ఈ రక్తపోటుతోటీ చావలేక చస్తున్నాను కాని అక్కడ వాడు రొంపట్టి చస్తాడేమోనని వీళ్ళభయం. మళ్ళీ ఏమయినా అంటే ఏడుస్తారు. ఇంతకీ నాకీవేళ తమలపాకులాశ లేదన్నమాట. పోనీ లే ఒక్కపూటలో నోరు పడిపోదు.

మా. ఆ: కాదుటే తల్లీ కాస్తాకూస్తా దూరం కనకనా పోనీ ఓసారి చూసొద్దామనుకోడానికి, యాభై అరవైమైళ్ళుంది. పూట ప్రయాణం. ఇంతకీ పలకరిస్తేనే మనిషికాదు కదా. ఈయన్ని నమ్ముకుని ప్రయాణం చేసేదేమిటి? ఇంక ఈజన్మకి ఒకటే ప్రయాణం.

అనుఅను. నోటికొచ్చినట్టల్లా అను. రేపు నువ్వు చచ్చినతర్వాత వైతరణీనది దాటుతున్నప్పుడు, నన్నిప్పుడన్న ఒక్కొక్క మాటా ఒక్కొక్క జలగై పీక్కుతిన్నప్పుడు తెలుస్తుంది. అదిగో వేసేసుకుంది తమలపాకులు మిగిలిన ఆ కాసిన్నీ యిచ్చినాచాలు. ఎందుకిస్తుంది? చిలకలుచుట్టి మరీ వేసుకుంటుంది.

శా: ఇవ్వాళ ఇక్కడ జరిగిన గందరగోళం టైమూ అక్కడ ఆయన భోజనం టైమూ ఒకటే. పాపం! పొలమారుతుంది కూడాను.

పొలమారు మారుతుంది. తుమ్మూ వొస్తుంది. అదీ ప్రమాదమే? ఈ ప్రేమ ఈ ఆరాటన వీళ్ళాయినకి నావయస్సు, దీనికి వాళ్లమ్మ వయస్సు వొచ్చినప్పుడుండాలి.

మా. ఆ: పొలమారేటంతసేపు విస్తరిదగ్గర కూర్చుంటాడులే పాపం! అసలు అన్న హితవే పోయిందిట.

శా: ఉత్త హార్లిక్సూ, బిస్కట్లూ, పళ్ళరసం తాగుతున్నారుట మొన్నటినుంచీ”

మరేం ఫర్వాలేదు. ఇదిగో ఇలా పెంచే వాణ్ణి పాతికేళ్ళకి ఏనుగంతమనిషినిచేశారు, చీమ కున్నంత మెదడున్నా లేకపోయినా. ఏదో తల్లీ తండ్రీలేని మేనల్లుడుకదా అని దగ్గిరుంచుకుని పిల్లనిచ్చి పెళ్ళిచేశాను. చదివించి వృద్ధిలోకి తీసుకొద్దామనుకుంటే వాణ్ణిలాగ బకాసురుడులాగ తయారుచేశారు తల్లీ కూతురూ. నూటయాభై రూపాయిలుపంపాలిట! నూటయాభైరూపాయిలు.

మా. ఆ: కాస్తాస్తే వోర్చుకోలేడు. పాపం! ఎంత నీరసించిపోయేడో ఏమిటో?

శా: రెండు రోజులునుంచి కసరత్తుచెయ్యడం కూడా మానేశారుట.

శని విరగడయ్యింది. దిక్కుమాలిన కసరత్తు. నాకసలు పాడి గదిలోకెడితే యమలోకంలో కెళ్ళినట్టుటుంది. ఆ గదిలో ఆ అద్దం, ఆ ఆంజనేయులూ, దారాసింగూ, గామా, కోడిరామ్మూర్తి ఫోటోలూ, ఆ గదలూ, యినపగుళ్ళూ ఆ అట్టహాసం, అబ్బబ్బ! అసలు నాకు సగం బ్లడ్ ప్రెషరు పీడి కసరత్తు చప్పుడు వల్లొచ్చింది. అసలు తలుచుకుంటేనే గుండెల్లో గోడ్డురోలరు పరుగెడుతున్నట్టుటుంది. అదేమిటి ఆ తమలపాకులు గూట్లో పెట్టింది. నా కిస్తుందేమో!

మా. ఆ: ఏం చదువులు ఏం లోకం? ఇంటిపట్టునుండి పట్టెడన్నం కడుపునిండా తినడానికి లేదుకదా! ఏదో ఈ యేటితోనైనా ఆ బి. ఏ. కాస్తా పూర్తవుతే.

శా: పాపం! కిందటి పరీక్షలకి ఎంత కష్టపడి చదివేరూ! చివరకి అన్నీ పుస్తకాల్లో లేని ప్రశ్న లడిగేరుట.

ఓరి వీళ్ళ అమాయికత్వం తగలెయ్యా. వాడు చెప్పడ మెలాయేడిసిందో వీళ్ళనమ్మడం అలాగే వుంది. వాడూ మీరూ గంగలోదిగండి నాకెందుకు. అసలు చదువుకోనేవాడికుండవల్సిన లక్షణాల్లో ఒక్కటికూడా లేదువాడికి. మూడేళ్లేనా తగలెయ్యకుండా ఎందులో ప్యాసయ్యేడు! మొన్నటిసారి పరీక్షలాఖరిని "ఎలారాశావురా?" అంటే బ్రహ్మాండంగా రాసేనన్నాడు. తీరా రిజల్టుస వొచ్చేక ఏమయ్యిందిరా అంటే నవ్వుతూ "Stepping stone to success' మామయ్యా" అంటాడు. వాడికేం సిగ్గా యెగ్గా!

శా: పోనీ అమ్మా ఈ సెప్టెంబరుపరీక్షలో ప్యాసవుతే మనమందరం తిరుపతెడతామని మొక్కు...

భేష్. ఇంకదొక్కటేతర్వాయి. ఆదెబ్బతోటి నాకు పక్షవాతంకూడా తయారవుతుంది.

మా. ఆ: ఇంకానయం. అలాంటిమొక్కులేమీ పెట్టకుతల్లీ. ఆయన యిదివరకుమనిషీకాదు. ఆ వోపికాలేదు. తిరపతీవొద్దు. వైకుంఠం వొద్దు.

ఓ హోహో! ఇదంత నామీద భక్తా? నా పెన్షన్‌మీద భక్తా?

శా: అబ్బే...ఛా...ఇప్పుడెలా వెడతామే? నాన్నగారికి బాగా తగ్గేకే వెడతాం.

తగ్గాలికదా. నాకు మతిపోయేలోగా వీడి చదువు పూర్తయి, ఆ కసరత్తులూ, ఆ కత్తిసాములూ, ఆ కాటాకుస్తీలు మాని నాలుగురాళ్లు సంపాదించుకునేటంత యోగ్యుడవడం చూస్తే నాకు తగ్గినంత ఫలం. అదుగో వక్కపొడిడబ్బా తీస్తూంది.

మా ఆ: తగ్గనీ తల్లీ! అలాగేవెడదాం తెల్లారి లేస్తే వెయ్యిదేముళ్ళకి మొక్కుతున్నాను. ఆ యేడుకొండలవాడికే దయుండాలికాని, అన్నీ అనుకూలిస్తే తిరపతెళ్ళడం ఎంతపని. ఈ వక్కపొడి తామలపాకులూ మీ నాన్నగారికిచ్చిరా అమ్మా.

శా: నాన్నగారికి తగ్గిపోతే తిరపతి వెడదామని మొక్కుకున్నావుకాదుటే. నాన్నగారికి తగ్గగానే ఎలాగా వెడతాం. దానితోబాటు ఈ మొక్కుకూడా తీర్చుకోవచ్చునని అన్నాను.

సరిసరి. అప్పుడే అయిందీ! మొక్కుకుందన్నమాట. వట్టి పిరికిమనిషి, అసలే నేనంటే యిది. అందులోనూ దైవభక్తి కూడా ఎక్కువేమో, మొక్కుగుని వుంటుంది.

శా: ఇందనాన్నా! ఉండు కాస్త మెత్తటి వక్కపొడి యిస్తాను. ఇంద. ఇప్పుడు నింపాదిగా వుందా?"

మొన్న సంతలోకొన్న తుని తమలపాకులనుకుంటాను. నోట్లోవేసుకోగానే కరిగిపోతున్నయ్. నిజానికి తమలపాకులురాస్తే మా ఆవిడేరాయాలి. నా కోపంకొద్దీ మనస్సులో ఏవో శాపనార్థాలు పెట్టుకుంటాను. కాని నేనంటే దానికెప్పుడూ పంచప్రాణాలూనూ.

శా: నాన్నా! బావకి యీనెల నూటయాభై రూపాయిలు పంపాలిట.

దీనికెప్పుడూ బావగొడవే. అయినా దాని తప్పేముంది? నామీద మా ఆవిడకున్న మనస్సులాంటిదే దీనికి వీళ్ళాయన మీదుంటుంది. ఇంతకీ దీనికిమాత్రం నేనంటే తక్కువప్రేమా? మొన్న నేనో లంఖణం చేసేటప్పటికి మంచాన్నంటిపెట్టుకుని అల్లాడిపోయింది,

మా. అ: అదేమిటే... వెఱ్ఱితల్లీ... అలా చిన్నమొహం చేసుకుంటావు?

శా: అదికాదే. ఏనెల కానెల ఖర్చు పెంచుతుంటే నాన్నగారుమాత్రం ఎక్కడనుంచి తెస్తారు.

మా. అ: ఇంకా నయం. పాపం! అంత దూరానున్నాడు. ఏమి యిబ్బంది పడుతూ రాశాడో! అదీకాక అతనేమీ దుబరాఖర్చు చేసే మనిషికాదు.

దుబరాఖర్చు చెయ్యడంటే నే నొప్పుకోను. ఇంతకీ చెడుబుద్ధులేమీ లేవు. బుద్ధిమంతుడు. భయభక్తులూ వున్నవాడే. వీటికితోడు ఆ సరస్వతీ కటాక్షం కూడా వుంటే బాగుండును. ఏదో ఈసారయినా పరీక్ష గట్టెకుతే... ఇంతకీ యీ నెల నూటయాభై రూపాయిలు పంపించమంటాడు. పంపించననుకోవడమే కాని పంపించడమెలాగా తప్పదు. నిజానికి పదిరూపాయిలెక్కువ పంపిస్తే పాడయిపోయీ,వాడిని పదిరూపాయిలు తక్కువ పంపించి రక్షించగలమా?

శా: నాన్నా... ఇవ్వాళ యింకా పోస్టుకి టైముంది. నేను వుత్తరం రాస్తాను. నువ్వు చెక్కు రాసియ్యి నాన్నా పంపించేస్తాను.

సరే అన్నట్లు తల వూపేను.

అభిప్రాయ వేదిక

# ఆంధ్రుని అభ్యర్థన

మర్ల కృష్ణమూర్తి

ఆంధ్రరాష్ట్రం వచ్చింది. రాలేదనుకున్నప్పుడు ఉన్న విచారానికీ, వచ్చినదన్న యిప్పటి ఉత్సాహానికీ ఎంతో తేడా ఉంది. ఏదో మహా పత్తుతో సహా యీ విజయం సిద్ధించినట్లుగా ప్రజలు భావిస్తున్నారేమో ననిపిస్తూంది. కురుక్షేత్ర యుద్ధం తరువాత పాండవుల విజయం లాంటిదేమో! నేటి మన ఆంధ్రరాష్ట్ర సిద్ధి. ఈ పరిస్థితికి కారణమేమో!

అప్పుడే కొంతమంది యీ రాష్ట్రంవల్ల వచ్చే లాభమేమా అన్న నిస్పృహతో మాట్లాడుతున్నారు. కారణాలు సర్వసామాన్యంగా ఇవి: రాజధాని సమస్య, రాష్ట్ర ప్రభుత్వం సంతృప్తికరంగా ఉండకపోవడం. పోతే నిజంగా ఆలోచించవలసిన ఆర్థిక పరిస్థితి మొదలైనవాటిని గురించి ఎవరూ బాధపడడంలేదు. పై రెండు సమస్యల్ని గురించి స్థూలంగా ఆలోచిద్దాము.

రాజధాని కర్నూలుగా ఉండాలని ఆంధ్ర శాసనసభ్యులు మొదట నిర్ణయించారు. తక్షణం ఒక ప్రచారము బయలుదేరింది. ఈ నిర్ణయం సరియైనది గాదని వారి వాదన. కర్నూలు రాజధానిగా ఎందుకుండాలో, ఎందుకుండ కూడదో ప్రజలందరికీ బాగా తెలిసింది. ఈ విషయాన్ని గురించిన ఆందోళన అంతా "ఆంధ్రుల ప్రత్యేకతగా" కనిపిస్తూంది తప్ప మరేమీలేదు. ఒక నిర్ణయం జరిగినతరువాత దానిని అనుసరించడంవల్ల కలిగే ప్రమాదమేమీలేదు. పోనీ ఆంధ్ర దేశంలో రాజధానికి సరియైన హంగులుకలిగిన పట్టణమేమైనా ఉన్నదేమో అంటే ఏదీ కనుపించదు. కర్నూలును వ్యతిరేకించేవారందరికీ కూడా ఒకే అభిప్రాయం లేదు. ప్రతీ పట్టణంవారికీ కూడా, ఆ రాజధాని హంగులు తమ పట్టణానికి మాత్రమే ఉన్నట్లుగా తోస్తూంది. వాంచూ రిపోర్టులో పేర్కొన్నట్లు ఆంధ్రులకు రాజధాని కాగలిగిన పట్టణము ఏదీ లేదు. చాలామంది విజయవాడను పేర్కొంటున్నారు. ఈ మధ్య కె. ఎల్. పి. పార్టీవారు కూడా దీనికి తమ అంగీకారాన్ని వెలిబుచ్చారు. విజయవాడ విషయం ఎంతవరకూ తెలిసి వీరు యీ ప్రచారం చేస్తున్నారో! వీరంతా నూజవీడులో భవనాలున్నాయని జ్ఞప్తికి తెస్తున్నారు. అంటే విజయవాడలో ఆఫీసులకు కూడా స్థలములేదని అంగీకరించినట్టేనా? నూజవీడునుండి బెజవాడకు ఆఫీసు సిబ్బంది రోజూ వెళ్లి వస్తూండాలని యీ సందర్భంలో గుర్తుంచుకోవాలి. (దూరము 14